TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 71 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | జూన్ 24, 2026

## అయోధ్య రామయ్యా..

### ఏమిటీ అపచారం!



2లో..

- రామాలయ విరాళాల లెక్కింపులో చేతివాటం..
- 'సిట్' దర్యాప్తులో నగ్నసత్యాలు!
- నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టం
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ భరోసా

**వాయిస్ ఆఫ్ వందే భారత్, బ్యూరో:** "అందరి బంధువయ్యా.. అయోధ్య రామయ్యా" అంటూ కోట్లాది మంది హిందువులు అత్యంత పవిత్రంగా కొలిచే రాముడి సాక్షిగా ఘోరమైన అపచారం జరిగిందన్న వార్త ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఐదు వందల ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ, ఎందరో కరసేవకుల త్యాగాలు, కోట్ల మంది భక్తులు తమ రక్తాన్ని కూడబెట్టి ఇచ్చిన విరాళాలతో భవ్యమైన అయోధ్య రామాలయం కొలువుదీరింది. అయితే, భక్తులు ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో సమర్పించిన కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగాయన్న నగ్నసత్యాలు ఇప్పుడు వెలుగులోకి రావడం ప్రతి రామభక్తుని మనసును తీవ్రంగా కలచివేస్తోంది. మొదట్లో ఈ నిధుల దారిమళ్లింపు ఆరోపణలను కేవలం రాజకీయ ప్రేరేపితమైనవిగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగినప్పటికీ, భక్తుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఉత్తరప్రదేశ్ సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం సిట్ జరిపిన ప్రాథమిక విచారణలో అడుగడుగునా నిర్లక్ష్యం, ఘోరమైన అవకతవకలు జరిగినట్లు బలమైన ఆధారాలు లభ్యమవడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.

## 'సర్' పై అప్రమత్తం కండి..

- నిర్లక్ష్యం వహిస్తే ఊపేక్షించం
- పనిచేయని లీడర్లను వదులుకోవడానికైనా సిద్ధం
- జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఘాటు హెచ్చరిక
- ఓటర్ల జాబితా సవరణ నెపంతో బీజేపీ కుట్రలకు తెరతీస్తోంది



2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ విషయంలో కాంగ్రెస్ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను, ప్రజాప్రతినిధులను క్షమించే ప్రసక్తి లేదని ఆయన తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తెలంగాణలో గురువారం నుంచి ఎస్ఐఆర్ ఓటర్ల సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో, బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ అత్యున్నత స్థాయి అత్యవసర జూమ్ వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది.

## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

### ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి



2లో..

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. 'రెన్యూవల్' సీఎం

- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రాష్ట్రం ఆగమైంది
- ఖమ్మం జిల్లా ప్రాజెక్టులపై ముగ్గురు మంత్రులకూ నిర్లక్ష్యమే
- సత్తుపల్లిలో కేటీఆర్ ధ్వజం



2లో..

**ఖమ్మం, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి రెగ్యులర్ ముఖ్యమంత్రి కాదని, ఆయన కేవలం ఢిల్లీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన 'రెన్యూవల్' ముఖ్యమంత్రి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఎద్దేవా చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో పర్యటించిన ఆయన, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

## రైతుబంధు విషయంలో అన్నదాతలకు మరోసారి దగా

- 'కుసుమ్' పథకంలో రూ. 1000 కోట్ల భారీ కుంభకోణం జరిగింది
- సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఘాటు విమర్శలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాలను పూర్తిగా అత్తెసరున పడేసిందని, రేవంత్ రెడ్డి సర్కార్‌లో 'స్కీమ్‌లు' పోయి 'స్కామ్‌లు' రాజ్యమేలుతున్నాయని బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో నడిచే 'కుసుమ్' సోలార్ పంప్‌సెట్ల పథకంలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ భారీ స్కామ్‌లో కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని, దీనిపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.




2లో..

## స్వల్పంగా దిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బంగారం కొనాలనుకునే వారికి శుభవార్త. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు మెల్లగా దిగి వస్తున్నాయి. అమెరికా డాలర్ బలపడడం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో పసిడికి డిమాండ్ తగ్గుతోంది.గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,330గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,300గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,40,000గా ఉంది.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, జూన్ 24, 2026

## 'సర్' పై అప్రమత్తం కండి..

◆ నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

◆ పనిచేయని లీడర్లను వదులుకోవడానికైనా సిద్ధం

◆ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఘాటు హెచ్చరిక



( **మొదటి పేజీత తర్వాత..**) టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌లతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో సీరియస్‌నెస్ లోపించడంపై మండిపడ్డారు. "ఎవరెవరు పనిచేస్తున్నారో, ఎవరెవరు నిర్లక్ష్యంగా ఉన్నారో నా దగ్గర పూర్తి రిపోర్ట్ ఉంది. వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దు. పనిచేయని వారికి కేవలం 10 రోజుల సమయం ఇస్తున్నాం.. అప్పటికీ తీరు మారకపోతే వారి స్థానంలో యాక్టివ్‌గా ఉన్న వేరే నాయకులను ఇన్‌ఛార్జులుగా నియమిస్తాం" అని సీఎం అల్టిమేటం జారీ చేశారు. పార్టీ కోసం పనిచేయని వారు ఎంతటి వారైనా అవసరం లేదని తేల్చిచెప్పారు. అవసరమైతే ఇన్‌ఛార్జ్ మంత్రులను కూడా మారుస్తామన్నారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓట్ల నిర్వహణలో బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను కాంగ్రెస్ శ్రేణులు గమనించాలని కోరారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. ఓటు హక్కు అనేది కేవలం రాజకీయాల కోసం మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి 'సోషల్ స్టేటస్' అని అభివర్ణించారు. ఎంతో మంది మహానుభావుల పోరాటం వల్లే నేడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఓటు హక్కు లభించిందని, ఆ హక్కును కాపాడవలసిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు.

# అయోధ్య రామయ్యా.. ఏమిటీ అపచారం

◆ రామాలయ విరాళాల లెక్కింపులో చేతివాటం..

◆ 'సిట్' దర్యాప్తులో నగ్నసత్యాలు!

◆ నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టం

◆ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

**వాయిస్ ఆఫ్ వందే భారత్, బ్యూరో:** "అందరి బంధువయ్యా.. అయోధ్య రామయ్యా" అంటూ కోట్లాది మంది హిందువులు అత్యంత పవిత్రంగా కొలిచే రాముడి సాక్షిగా ఘోరమైన అపచారం జరిగిందన్న వార్త ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఐదు వందల ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ, ఎందరో కరసేవకుల త్యాగాలు, కోట్ల మంది భక్తులు తమ రక్తాన్ని కూడబెట్టి ఇచ్చిన విరాళాలతో భవ్యమైన అయోధ్య రామాలయం కొలువుదీరింది. అయితే, భక్తులు ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో సమర్పించిన కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగాయన్న నగ్నసత్యాలు ఇప్పుడు వెలుగులోకి రావడం ప్రతి రామభక్తుని మనసును తీవ్రంగా కలచివేస్తోంది. మొదట్లో ఈ నిధుల దారిమళ్లింపు ఆరోపణలను కేవలం రాజకీయ ప్రేరేపితమైనవిగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగినప్పటికీ, భక్తుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఉత్తరప్రదేశ్ సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం సిట్ జరిపిన ప్రాథమిక విచారణలో అడుగడుగునా నిర్లక్ష్యం, ఘోరమైన అవకతవకలు జరిగినట్లు బలమైన ఆధారాలు లభ్యమవడం దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.

### సీసీటీవీ దృశ్యాల డిలీట్..

ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో కొందరు సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. దీనిని కప్పిపుచ్చేందుకు కొన్ని కీలకమైన సీసీటీవీ ఫుటేజీలను కావాలనే డిలీట్ చేశారనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగదుతో పాటు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాలను నకిలీ వాటితో మార్చేశారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారణ జరుపుతోంది. ఈ నిర్లక్ష్యం వెనుక కేవలం కొందరు వ్యక్తుల స్వార్థమే కాకుండా, పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే 'కంచే చేను మేసిన చందంగా' వ్యవహరించిందనే వాదనలు భక్తులను నిర్ఘాంతపరుస్తున్నాయి.

### 150 మంది విచారణ..

వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి పెద్ద పరీక్షగా మారింది. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ఆయుధంగా చేసుకుని ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నాయి. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని సుదీర్ఘంగా ప్రశ్నించింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ప్రస్తుతం నిఘా నీడలో ఉండగా, ట్రస్ట్ కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రా, కన్స్ట్రక్షన్ మేనేజర్ గోపాల్ రావుల పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్ సంస్థలకు చెందిన ఆరుగురు ఉద్యోగులను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించాడని భావిస్తున్న రామ్‌శంకర్ యాదవ్ అలియాస్ తిన్ను యాదవ్‌తో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ కఠిన ఆదేశాలు జారీ చేసింది.

### సీఎం యోగి అల్టిమేటం..

ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఇక్కడ కూడా ప్రభుత్వ పర్యవేక్షణలో ఒక 'ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్'ను నియమించాలని, విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించి, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని సిట్ తన నివేదికలో సిఫార్సు చేయనుంది. ఈ సంచలన వివాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ.. "భక్తులు, ప్రజలు మరో 15 రోజులు ఓపిక పట్టాలి. సిట్ దర్యాప్తు ద్వారా పూర్తి నిజానిజాలు బయటకు వస్తాయి. దేవుడి నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారు ఎంతటి వారైనా, ఏ పదవిలో ఉన్నా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదు.. కఠినంగా శిక్షిస్తాం" అని హామీ ఇచ్చారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆలయ నిర్వహణలో జవాబుదారీతనం లోపించడం, అక్రమార్కులు రాముడి సొమ్ముకే టోపీ పెట్టడంపై దేశవ్యాప్తంగా ఇప్పుడు తీవ్ర చర్చ నడుస్తోంది.

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. 'రెన్యూవల్' సీఎం

▪ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రాష్ట్రం ఆగమైంది

▪ ఖమ్మం జిల్లా ప్రాజెక్టులపై ముగ్గురు మంత్రులకూ నిర్లక్ష్యమే

▪ సత్తుపల్లిలో కేటీఆర్ ధ్వజం

(**మొదటి పేజీ తర్వాత..**) కాంగ్రెస్ చేతికి అధికారం ఇస్తే రాష్ట్రం అంధకారమవుతుందని నాడు కేసీఆర్ హెచ్చరించిన మాటలు నేడు అక్షరాలా నిజమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మారుమూల ప్రాంతాల్లో ఎక్కడకు వెళ్లినా.. దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 72 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టారని, అంతలా తిరిగిన ఆయన రాష్ట్రానికి ఏం సాధించి తెచ్చారో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సత్తుపల్లి ప్రెస్ క్లబ్ విలేకర్లకు నిబంధనల విరుద్ధంగా మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్లు జారీ చేసి రేవంత్ సర్కార్ జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదిలిపెట్టకుండా వేధిస్తోందని.. రైతులకు రైతుబంధు సకాలంలో ఇవ్వకుండా, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో గోదావరి జలాలను ఒడిసిపట్టి రూ.10,000 కోట్లతో ప్రతిష్ఠాత్మక 'సీతారామ ప్రాజెక్టు'కు శ్రీకారం చుట్టిందని కేటీఆర్ గుర్తుచేశారు. "గతంలో కాంగ్రెస్ వాళ్లు జలయజ్ఞం పేరుతో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అని కేవలం రాళ్లు వేసి పోయారు తప్ప చేసిందేమీ లేదు. కానీ కేసీఆర్ భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద ఈ ప్రాజెక్టు నిర్మించి 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే బృహత్తర యజ్ఞాన్ని ప్రారంభించారు. అందులో రూ.8,000 కోట్లు (80% నిధులు) మా ప్రభుత్వమే ఖర్చు పెట్టింది" అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునేది సత్తుపల్లి నియోజకవర్గమేనని, ఇక్కడి 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అయితే, ఈ రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే.. వారు జిల్లా రైతాంగానికి తిరిగి ఏం ఇచ్చారని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ జిల్లా నుండి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముగ్గురు కీలక మంత్రులు ఉన్నప్పటికీ, జిల్లా ప్రాజెక్టులపై వారి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. సరిపోల్చదగిన ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ.. మొన్నటి ఎన్నికల్లో కల్లూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ గెలిచేదని, సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతోనే సీటు చేజారిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ శ్రేణులు గెలుపునకు పొంగిపోవద్దని, ఓటమికి కుంగిపోవద్దని, ప్రజాక్షేత్రంలో ఉంటూ కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

## రైతుబంధు విషయంలో అన్నదాతలకు మరోసారి దగా

• 'కుసుమ్' పథకంలో రూ. 1000 కోట్ల భారీ కుంభకోణం జరిగింది

• సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఘాటు విమర్శలు

(**మొదటి పేజీ తర్వాత..**)రైతుబంధు నిధుల పంపిణీపై సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త డ్రామాలకు తెరతీశారని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. "రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లే యోచనలో ఉంది. అందుకే ఇప్పుడు ఓట్ల కోసం వానాకాలం రైతుబంధు వేస్తామంటూ నాటకాలాడుతున్నారు. మరి గత యాసంగి కాలానికి సంబంధించిన రైతుబంధును మీ తాత ఇస్తాడా?" అంటూ ఘాటుగా చురకలు అంటించారు. కేసీఆర్ హయాంలో నిరాటంకంగా సాగిన రైతుబంధుకు కాంగ్రెస్ ప్రభుత్వం బ్రేకులు వేసిందని, ఇప్పటివరకు తెలంగాణ రైతులకు ఈ ప్రభుత్వం రూ. 30 వేల కోట్ల బకాయి పడిందని, వానాకాలంతో పాటు యాసంగి బాకీని కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ బ్యాంకులను సైతం బ్లాక్‌మెయిల్ చేసే మొనగాడిగా మారాడని జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందాలతో నడుస్తున్నాయని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ దేశంలో ఎక్కడైనా ఆఫీస్ పెట్టుకోవచ్చని, ఆయన ఎప్పటి నుంచో ఇక్కడే ఉంటున్నారు కదా అని గుర్తుచేశారు. గతంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా పవన్ కళ్యాణ్ చేసిన 11 రోజుల అన్న దీక్ష కూడా ఇక్కడే జరిగిందని, ఇక్కడి తిండితోనే వారి శరీర నిర్మాణం జరిగిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్షేత్రస్థాయి పర్యటనలకు వస్తున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ ప్రభుత్వం వణికిపోతోందని ఆయన పేర్కొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు

### ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం ధర్వేశిపురంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో మంత్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా దేవాలయం నుండి కల్యాణ మండపం వరకు మంత్రి మేళతాళాలతో ఊరేగింపుగా పట్టు వ□స్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులతో కలిసి శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి



జమదగ్ని మహర్షి వారి దివ్య కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రేణుక ఎల్లమ్మ దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, ఆలయ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఈఓ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్ పాల్గొన్నారు.

# కేంద్రం నిర్లక్ష్యంతోనే 17 మంది 'నీట్' విద్యార్థుల ఆత్మహత్యలు

◆ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్లే దేశంలో 17 మంది నీట్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఈ ఆత్మహత్యలకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో అచ్చంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనకు ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వయంగా నాయకత్వం వహించారు. ధర్నానుద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల నమ్మకాన్ని వమ్ము చేశాయన్నారు. ఈ అక్రమాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల, యువత భవిష్యత్తుతో ఆడుకునే ఇలాంటి దుర్మార్గపు విధానాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇకనైనా అరికట్టాలని, భవిష్యత్తులోనైనా పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను తీసుకురావాలని కోరారు. దేశానికి వెన్నెముక లాంటి విద్యార్థులు, నిరుద్యోగ యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ నిరసన, ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంప్

◆ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ
◆ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి
◆ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట నియోజకవర్గ ప్రజలకు మెగా సర్జికల్ క్యాంప్ ద్వారా అత్యంత నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. అచ్చంపేట పట్టణంలో త్వరలో ప్రారంభం కానున్న 'నాలుగో విడత మెగా సర్జికల్ క్యాంప్' ముందస్తు ఏర్పాట్లను ఆయన గురువారం స్థానిక వైద్య అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్సల కోసం అవసరమైన అన్ని రకాల అధునాతన వసతులు, వైద్య సిబ్బంది సమన్వయం, రోగులకు ఉచితంగా అందించాల్సిన సేవలు, మందుల లభ్యతపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్యాంప్‌కు వచ్చే రోగులు మరియు వారి సహాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, వసతి, వైద్య సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి శస్త్రచికిత్సను అత్యంత జాగ్రత్తగా, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో విజయవంతం చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందించేందుకు ఈ క్యాంప్ ఒక గొప్ప అవకాశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రామకృష్ణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ మహేష్, డాక్టర్ ప్రతీప్ రాజ్, నర్సింగ్ ఆఫీసర్లు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# గంగమ్మ తల్లి దివ్య కల్యాణ మహోత్సవం

• భక్తిశ్రద్ధలతో రాజరాజేశ్వర స్వామి, గంగాదేవి కల్యాణ వేడుకలు
• పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణంలో బుధవారం శ్రీ గంగాదేవి, శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దివ్య కల్యాణోత్సవాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య, అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మూలవాగు ఒడ్డున వెలిసిన గంగమ్మ తల్లి ఆలయ ఆవరణలో అర్చకస్వాములు వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ కల్యాణ వేడుకను జరిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గంగాదేవి అమ్మవారికి, రాజన్న స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో విప్ ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సన్మానించారు. కల్యాణ వేడుక అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. జగన్మాత గంగాదేవి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దక్షిణ కాశీగా పూజలందుకుంటున్న వేములవాడ రాజన్న క్షేత్ర మహిమ దేశవ్యాప్తంగా మరింత విస్తరించాలని, భక్తులందరిపై ఆ స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని తాను ప్రార్థించినట్లు తెలిపారు. స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించేందుకు వేములవాడ పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కల్యాణ మహోత్సవం ఆలయ ప్రాంగణంలో మిన్నంటిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. భక్తులు స్వామివారి ఆశీస్సులు పొంది, తీర్థప్రసాదాలను స్వీకరించారు. గంగపుత్ర సంఘం ప్రతినిధులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పరమ పవిత్ర కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు పంపరి శంకర్, దేవయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# చెన్నారం ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

## గ్రామ అధ్యక్షుడిగా గుద్దటి శ్రీశైలం ఏకగ్రీవం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని చెన్నారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గో టూ విలేజ్" కార్యక్రమంలో భాగంగా, గ్రామ స్థాయిలో ఉద్యమ బలోపేతానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో తాలూకా నాయకులు గుద్దటి ప్రవీణ్ మాదిగ ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడెల్లి ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ.. మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లలు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, రాబోయే జూలై 7న 'మాదిగ జాతి పండుగ'ను పురస్కరించుకొని, గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా, పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆయన కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం చెన్నారం గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో గ్రామ అధ్యక్షుడు గుద్దటి శ్రీశైలం, ఉపాధ్యక్షుడు డొక్కు విష్ణు, అధికార ప్రతినిధి గుద్దటి బాలయ్య, ప్రధాన కార్యదర్శులుగా గుద్దటి అనిల్, ఇంజమూరి బాలస్వామి, కార్యదర్శులుగా బర్పటి రేనయ్య, శామాలయ్యలు ఎన్నికయ్యారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్మ రాంప్రసాద్, బిట్టు, నానిలతో పాటు గ్రామ పెద్దలు, యువ నాయకులు, ఉద్యమ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేదలకు 25శాతం ఉచిత సీట్లు ఇవ్వాలి

## ఆర్డీఓకు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకుల వినతిపత్రం




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వర్ధన్ సైదులు, ఎస్ఎఫ్ఐ తాలూకా నాయకులు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అచ్చంపేట నియోజకవర్గ ఆర్డీఓ యాదగిరికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వర్ధన్ సైదులు మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యాశాఖ అధికారులు విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని, వారి నిర్లక్ష్యం వల్లే ప్రైవేట్ యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి కోట్లకు పడగలెత్తుతున్నాయని మండిపడ్డారు. చట్ట ప్రకారం నిరుపేద విద్యార్థులకు దక్కాల్సిన 25 శాతం ఉచిత సీట్లను ఏ ఒక్క పాఠశాల కూడా కేటాయించడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తున్నాయని సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు భిక్షపతి, సైదులు, రాజు, మమత, చరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## ఆత్మకూరు సీఐ సంతోష్



**ఆత్మకూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, సుసంస్కృతమైన జీవితాన్ని గడపాలని ఆత్మకూరు సీఐ ఆర్.సంతోష్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన చర్యల్లో భాగంగా బుధవారం ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు "డ్రగ్స్‌కు నో చెప్పండి" అనే అంశంపై ముగ్గుల (రంగవల్లుల) పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సృజనాత్మకతతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఐ సంతోష్ చేతుల మీదుగా మొదటి, ద్వితీయ బహుమతులను అందజేశారు. అదేవిధంగా గతంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కూడా ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితమే కాకుండా, కుటుంబాలు రోడ్డున పడతాయని, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బంగారు భవిష్యత్తు ఉన్న యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిసైతే జీవితం సర్వనాశనమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపక బృందం, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగంలో సమూల మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి కృషి



- 'అమ్మ ఆదర్శ పాఠశాలల'తో సర్కారు బడుల బలోపేతం
- వేములవాడలో ఆల్ఫోర్స్ నూతన పాఠశాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రమిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై, సంస్థ చైర్మన్ నరేందర్ రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా విధానానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ అంతిమ ఆశయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆహ్లాదకరమైన, మెరుగైన వాతావరణం కల్పించేందుకు 'అమ్మ ఆదర్శ పాఠశాలల' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని విప్ తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, అవసరమైన ఫర్నిచర్ మరియు పరిశుభ్రత వంటి కనీస మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, గురుకుల విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి వారి సంక్షేమానికి పెద్దపీట వేశామని గుర్తుచేశారు. వేములవాడ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెల్లడించారు. నియోజకవర్గంలో ఏటీసీతో పాటు ఆధునిక హంగులతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల' ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' వ్యవస్థను తీసుకొచ్చి, విద్యార్థులను అంతర్జాతీయ పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో విద్యా సేవలందిస్తున్న ఆల్ఫోర్స్ సంస్థ వేములవాడలో తన శాఖను ప్రారంభించడం అభినందనీయమని విప్ కొనియాడారు. అయితే ప్రైవేట్ విద్యాసంస్థలు కేవలం లాభాపేక్షతోనే కాకుండా సామాజిక బాధ్యతతో పనిచేయాలని హితవు పలికారు. విద్యార్థులకు కేవలం చదువే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆధునిక సాంకేతిక జ్ఞానాన్ని అందించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తుమ్మ మధు, స్థానిక కౌన్సిలర్లు, ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పోచమ్మ గుడిలో పోతురాజు విగ్రహం ధ్వంసం

- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట పట్టణంలో గురువారం తీవ్ర కలకలం రేగింది. ఇక్కడి స్థానిక పోచమ్మ దేవాలయ ప్రాంగణంలోని పోతురాజు విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అత్యంత పవిత్రంగా భావించే ఆలయంలో విగ్రహం ధ్వంసమైన వార్త క్షణాల్లో దావానలంలా వ్యాపించడంతో పట్టణంలో ఒక్కసారిగా తీవ్ర ఆందోళన, ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే హిందూ ధార్మిక సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తక్షణమే స్పందించి పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించి, ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులు, స్థానికులు శాంతంగా ఉండాలని, ఎలాంటి ఉద్రిక్తతలకు లోనుకావద్దని కోరారు. సమాజంలో మతసామరస్యాన్ని దెబ్బతీసే ఇలాంటి సంఘటనలను సహించేది లేదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల శ్రేణులు భారీగా మోహరించి ఈ ఘటనను తీవ్రంగా ఖండించాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అచ్చంపేట పోలీసులు రంగంలోకి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అచ్చంపేట ఎస్సై సద్దాం హుస్సేన్ తన సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దేవాలయ ప్రాంగణంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను అత్యంత వేగంగా పరిశీలించారు. పోలీసుల సమర్థతతో, ఘటన జరిగిన కేవలం రెండు గంటల వ్యవధిలోనే నిందితుడిని గుర్తించి, కేసును విజయవంతంగా ఛేదించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి దర్యాప్తును వేగవంతం చేశారు. పోలీసులు సకాలంలో స్పందించి నిందితుడిని పట్టుకోవడంతో స్థానికులు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.



# 'చంద్రసాగర్' నుంచి సాగునీటి విడుదల

- గేట్లు ఎత్తి కాల్వలకు నీటిని వదిలిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ
- 15 వేల ఎకరాలకు లబ్ధి..
- రైతాంగంలో హర్షాతిరేకాలు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట మండల పరిధిలోని ప్రముఖ సాగునీటి ప్రాజెక్టు, చారిత్రాత్మక చంద్రసాగర్ చెరువు నుండి రైతులకు సాగునీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గురువారం క్రస్ట్ గేట్లను ఎత్తి కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. గతంలో చివరిసారిగా వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2009 సంవత్సరంలో ఈ చంద్రసాగర్ నుండి సాగునీటిని విడుదల చేయగా, మళ్లీ దాదాపు 17 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఇప్పుడు నీటిని విడుదల చేయడం గమనార్హం. ఈ విద్యాసంవత్సరం/సీజన్‌లో కురిసిన రికార్డు స్థాయి భారీ వర్షాలకు చంద్రసాగర్ ప్రాజెక్టు పూర్తి మట్టానికి చేరుకొని అలుగు పారడంతో, రైతాంగం అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే వంశీకృష్ణ తక్షణమే స్పందించి ఈ నీటి విడుదల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నీటి విడుదల ద్వారా నియోజకవర్గ పరిధిలోని సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందనుంది. ఈ సందర్భంగా కాల్వ గట్టుపై ప్రత్యేక పూజలు నిర్వహించి, నీటిని విడుదల చేసిన అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడారు. రైతుల సంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు ఎండిపోయిన చంద్రసాగర్ పరివాహక ప్రాంతం, నేడు జలకళతో సంతరించుకోవడం శుభపరిణామమన్నారు. నియోజకవర్గంలోని ప్రతి చివరి ఎకరాకు సాగునీరు అందించి, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం నీటి వనరులన్నింటినీ పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలుగా సాగునీరు లేక ఇబ్బందులు పడ్డ తమకు, 17 ఏళ్ల తర్వాత మళ్లీ చంద్రసాగర్ జలాలు విడుదల కావడం పట్ల స్థానిక రైతాంగం హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వందలాది మంది రైతులు, స్థానిక ప్రజలు పాల్గొని కాల్వల ద్వారా పరుగులు తీస్తున్న జలాలకు ఘన స్వాగతం పలికారు.

